
క్లుప్తంగా

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో రీసెర్చ్ పేపర్ సమర్పణ

కేయూ క్యాంపస్: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 9న నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం నుంచి డాక్టర్ నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ అండ్ మ్యాథ్సమెటిక్స్ ఐకానిస్ మ్యాట్ –23 అనే అంశంపై నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో నరేందర్ తన రీసెర్చ్ పేపర్‌ను సమర్పించారు.

ఈసారి కొత్త నోములు లేవు



మాట్లాడుతున్న అనంత మల్లయ్యశర్మ

కాజీపేట: తిథి, నక్షత్రం కలిసి ఉన్నప్పటికీ విశాఖ కార్తె ఉన్నందున ఈ సంవత్సరం దీపావళి పండుగకు కొత్త నోములకు అవకాశం లేదని భద్రకాళి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి, శ్వేతార్క ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ తెలిపారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది ఏదైనా అశౌచంతో నోము పడిపోయిన వాళ్లు వాకిలి దేవర చేసుకొని నోముకు ఏర్పాట్లు చేసుకోవచ్చని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో విశాఖ కార్తెకు పట్టింపు లేకుండా కొత్త నోము నోముకుంటారని, అది వారివారి ప్రాంతీయ ఆచార, సంప్రదాయాల ప్రకారం నిర్ణయించుకుంటారని స్పష్టం చేశారు. గ్రామ పురోహితుల నిర్ణయాలకు అనుగుణంగా నోముల విషయాన్ని నిర్ధారించుకోవాలని కోరారు.

సాహితీ పురస్కారానికి వెంకటరత్నం ఎంపిక



హన్మకొండ కల్చరల్: రామశర్మ స్మారక సాహితీ పురస్కారానికి హనుమకొండకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, సీకేఎం కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ గుంజి వెంకటరత్నం పోలూరి హనుమజ్జాని ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్ డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరగనున్న కార్యక్రమంలో ఆయనకు పురస్కార ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నంకు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గిరిజామనోహర బాబు, కుందావజ్జుల కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్వీఎన్.చారి, వనం లక్ష్మీకాంతారావు, మల్యాల మనోహర్‌రావు, జూలూరు నాగరాజు అభినందనలు తెలిపారు.

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్



హన్మకొండ: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ తాళ్లపల్లి సురేష్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సురేష్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు.

బీసీ ప్రజా సంఘం అర్బన్ అధ్యక్షురాలిగా దేవిక



హన్మకొండ: తెలంగాణ బీసీ ప్రజా సంఘం హనుమకొండ అర్బన్ ప్రెసిడెంట్‌గా హనుమకొండలోని విజయపాల్‌కాలనీకి చెందిన చెట్టిపెల్లి దేవిక నియమితులయ్యారు. ఈమేరకు గీసుగొండ మండలం ధర్మారంలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమెకు నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ అందజేశారు.

పీహెచ్‌డీలో అవకతవకలపై విచారణ జరిపించండి

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను మంగళవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లు సక్రమంగా జరగలేదని ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులతో వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు దాడి చేయించారని ఆరోపించారు. కాగా, మరోసారి ఈనెల 13న హైదరాబాద్‌కు రావాలని ఆయా విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులకు కరుణ సూచించారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు మాచర్ల రాంబాబు, అంబాల కిరణ్, ఆరెగంటి నాగరాజు, అంకెళ్ల శంకర్, బొట్ల మనోహర్, ఎండీ.పాషా, నిమ్మల రాజేష్, రాకేష్, కుమార్ తదితరులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- తిలక్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు, ప్రజలు





ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ తిలక్ రోడ్డులో ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. గత కొన్నిరోజులుగా మ్యాన్‌హోల్ ఐరన్ గ్రిల్స్ వంగిపోయి ఉన్నాయి. దాంతో వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో స్థానికులు స్పందించి ఆ మ్యాన్‌హోల్ చుట్టూ ఇసుక బస్తా, రాళ్లు పెట్టారు. ఇకనైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గ్రెయిన్ మార్కెట్‌లో పని భద్రత కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో విధులు నిర్వర్తిస్తున్న గుమస్తాలు, దడువాయిలు, హమాలీలు, బండ్ల మోత, బుల్లక్ కార్ట్ కార్మికులకు పని భద్రత కల్పించాలని దడవాయి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈటల రాజేందర్, సోల రవి కోరారు. ఈమేరకు మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం మల్లేశం, ఉన్నత శ్రేణి కార్యదర్శి రాహుల్‌కు బుధవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో అన్ని రకాల కార్మికులు కలిసి సుమారు 5వేల మంది ఉన్నారని తెలిపారు. మార్కెట్‌ను నమ్ముకుని వివిధ రకాల పనులు చేసే కార్మికులకు పని భద్రత కల్పించి, వారికి న్యాయం చేయాలని కోరారు.

ఆడ పిల్లలను చదివించాలి



మాట్లాడుతున్న మధురిమ

కాజీపేట: ఆడ పిల్లలను ఉన్నతంగా చదివించాలని హనుమకొండ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి మధురిమ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవ వేడుకలను కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ పిల్లల చదువుల ఆవశ్యకతపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాటు లబ్ధిదారులు కలిసి పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, బీఆర్‌బీ స్వర్ణలత, టీచర్లు శ్రీదేవి, విజయమణి, సంగీత, స్వరూప పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే సీనియర్ డీఎంఈకి సన్మానం



స్వరాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ రైల్వే సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ (డీఎంఈ) స్వరాజ్‌కుమార్‌ను రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ జోనల్ సహాయ కార్యదర్శి సీహెచ్.కొమ్మాలు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం సన్మానించారు. కాజీపేట ప్రాంతానికి చెందిన స్వరాజ్‌కుమార్.. విధి నిర్వహణలో ఇటీవల సికింద్రాబాద్ మౌలాలి నుంచి కాజీపేట డీజిల్ షెడ్‌కు బదిలీపై వచ్చారు. ఈమేరకు ఆయనను అసోసియేషన్ నాయకులు కలిసి కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాజీపేట బ్రాంచీ అధ్యక్షుడు సంగమయ్య, ఉపాధ్యక్షుడు మూల అయిలయ్య, సహాయ కార్యదర్శి సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

15నుంచి డీటీఎఫ్ మహాసభలు



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

కాజీపేట రూరల్: ఈనెల 15, 16, 17వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మైదానంలో డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని డీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాస్, టీ.సుదర్శనం తెలిపారు. మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో డీటీఎఫ్ 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999లో ఏర్పడిన డీటీఎఫ్.. 25వ వసంతంలోకి అడుగు పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ ఎస్ఎం.స్వామి, ఉపాధ్యాయులు సతీష్‌కుమారి, సతీష్‌పాల్, సునీత, పద్మ, మహేష్, వరలక్ష్మి, మగబుల్ హుస్సేన్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయ సాధనకు కష్టపడాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖిలా వరంగల్: తల్లిదండ్రుల ఆశయం, తమ లక్ష్య సాధనకు విద్యార్థులు మరింతగా కష్టపడి చదువుకోవాలని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి సూచించారు. వరంగల్ శంభునిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు (ఫ్రెషర్స్ డే) స్వాగతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'జంగాను విమర్శించే స్థాయి మర్రికి లేదు'



మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్‌యాదవ్

కాజీపేట అర్బన్: నిత్యం ప్రజల్లో ఉండే జంగా రాఘవరెడ్డిని విమర్శించే స్థాయి ప్రజాదరణ లేక నామినేటెడ్ పోస్టు తీసుకున్న మర్రి యాదవరెడ్డికి లేదని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని పశ్చిమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ రవీందర్‌యాదవ్ మాట్లాడారు. పశ్చిమలో ఓటమి భయం పట్టుకున్న వినయ్‌భాస్కర్ రాసి ఇచ్చిన స్క్రిప్ట్‌ను మర్రి చదవడం శోచనీయమని అన్నారు. పశ్చిమ ఎన్నికల్లో జంగా విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, విజయ్‌కుమార్, సాగర్, మహేందర్‌రెడ్డి, కోటి తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన దసరా ఉత్సవ కమిటీ

కరీమాబాద్: వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో జరగనున్న సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను విజయవంతం చేసేందుకు బందోబస్తు ఏర్పాటు చేయాలని దసరా ఉత్సవ కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను బుధవారం కలిసి వినతిపత్రంతోపాటు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపురి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

15నుంచి దాండియా ఉత్సవం

నయీంనగర్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రావ్యస్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో భద్రకాళి ట్యాంక్ బండ్‌పై ఈనెల 15నుంచి 23వరకు సాయంత్రం 6నుంచి 9గంటల వరకు దాండియా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు స్రవంతి రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉత్తమ డ్రెస్సింగ్, ఉత్తమ దాండియా నృత్యం, ఆశ్చర్యకరమైన వినోదాత్మక అంశాలు, ఫైర్ జిమ్నాస్టిక్స్ మ్యూజిక్, సంప్రదాయ గిరిజన సంగీతం, నృత్యాలు, మ్యాజిక్ షో, 360 డిగ్రీల సెల్ఫీ బూత్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. దాండియా కర్రలు ఎవరివి వారే తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగీత, మాధవి, ప్రసాద్, శ్రీకాంత్, తేజ, లత, గిరి తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సహకరించాలి

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో జరగనున్న బతుకమ్మ, రావణసుర వధ, దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సహకరించాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను శివనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు దూపం సంపత్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, ఆర్‌టీఏ మెంబర్ గోరంటల మనోహర్, ఓని భాస్కర్, బాంబుల కుమార్, ఓంప్రకాష్ కోలారియా, గుత్తికొండ నవీన్, వేముల నాగరాజు, మార్టిన్ లూథర్, సిద్దోజు శ్రీనివాస్, కంచ సంపత్, ఆంజనేయులు, ఎండీ.ఇక్బాల్, సంతోష్ ఉన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కేసముద్రం – ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం కస్నా తండాకు చెందిన బోడ పూల్‌సింగ్ (50).. భార్య వదిలేయడంతో ఒంటరిగా తన అన్న కుమారుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది వెంకటగిరి గ్రామ క్వారీ సమీపంలో రైల్వే ట్రాక్ అప్‌లైన్‌లో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ కేసు నమోదు చేశారు. పూల్‌సింగ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి అన్న కుమారుడు బోడ చంద్రకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో వర్క్‌షాప్



వర్క్‌షాప్ నివేదికను అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

కరీమాబాద్: వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో 'ఇంటిగ్రేటింగ్ క్లినికల్ ఫార్మసీ రీసెర్చ్ అండ్ ఇంటర్ షిప్‌షిప్' అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికేర్ జనరల్ హాస్పిటల్, ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన అవెండి ఇన్నోవేషన్ల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ తరుణ్‌రెడ్డి, డాక్టర్ నజియా అంజుమ్, మహేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, సీఐ వెంకన్న, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ప్రతీక్, డాక్టర్ అనుశ్రీ, డాక్టర్ జయప్రశాంత్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, వైష్ణవి, పుష్ప, సత్యనారాయణ పట్నాయక్, నాగిరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ప్రగతికి సీఈఓ చిన్నారావు కృషి



చిన్నారావును సన్మానిస్తున్న రవీందర్‌రావు, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు

హన్మకొండ: వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా చింతలపూడి చిన్నారావు కర్తవ్య దీక్షతో పని చేశారని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ప్రశంసించారు. మూడేళ్ల కాలపరిమితితో నియమితులైన చిన్నారావు.. కాల పరిమితి ముగియడంతో హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ డీసీసీబీ అభివృద్ధికి, అత్యధిక లాభాలు సాధించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అధికారులు, ఉద్యోగుల సమన్వయం, సహకారాలతో బ్యాంకు వ్యాపారాభివృద్ధి సాధించినట్లు చెప్పారు. అధికారులు, ఉద్యోగులు బ్యాంకు ప్రగతిని ఇలాగే ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారావును డీసీసీబీ పాలక వర్గం, అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు ఎన్నమనేని జగన్‌మోహన్ రావు, రమేష్, మురళీధర్, నాబార్డు డీడీఎంలు చంద్రశేఖర్, రవి, ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ కృష్ణ, డీసీసీ జనరల్ మేనేజర్ శ్రీధర్, డీజీఎంలు రోహిణి, దమయంతి, కురువా, ఏజీఎంలు రాజశేఖర్, నవీన్, రాధిక, ఉద్యోగుల యూనియన్ ప్రెసిడెంట్ రజిత, జనరల్ సెక్రటరీ నాగరాజు, కోశాధికారి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీని విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: బీఆర్.అంబేద్కర్ అతిపెద్ద విగ్రహాన్ని అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఈనెల 14న ఆవిష్కరించనున్నారు. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో 19 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. అంబేద్కర్ మేధస్సును అమెరికా ప్రభుత్వం గుర్తించి ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నందుకు కృతజ్ఞతగా సంఘీభావం తెలుపుతూ ఈనెల 13న జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సంఘీభావ బైక్ ర్యాలీ నిర్వహించబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు వరంగల్ ఎంజీఎం సెంటర్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, మాల మహానాడు బాధ్యులు రామచంద్రరావు, వెంకటేశ్వర్లు, జెట్టి రాజేందర్, మేడ రంజిత్, రవికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోదామాధవ కేంద్రంలో పితృ ద్వాదశి పూజ



తదియారాధనలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ కల్చరల్: పితృ రుణం తీర్చుకోవడం అంటే వారు చనిపోయిన తరువాత ఆడంబరంగా కర్మలను నిర్వహించడం మాత్రమే కాదని వారు బతికి ఉన్న సమయంలోనూ వారు చెప్పిన మంచి విషయాలను పాటించి వారికి సేవచేయడమే అని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి అన్నారు. హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో బుధవారం ఉదయం పితృ ద్వాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామివారికి అర్చకులు విశేష పూజలు, మహా హారతి జరిపి మహా నివేదన చేశారు. అనంతరం గోమాతకు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరుట్ల గోదాదేవి, వెన్నపురెడ్డి రమణారెడ్డి సరళ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.


ఉర్సుగుట్ట చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖిలా వరంగల్: నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు వద్ద ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా రూ.50 వేలకు మించి డబ్బులు, మద్యం, మత్తు పదార్థాలు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

15నుంచి పద్మాక్షి శరన్నవరాత్రోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌శర్మ

నయీంనగర్: హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానంలో ఈనెల 15నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు, 25న శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకుడు నాగిళ్ల శంకర్ శర్మ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15న ఉదయం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారని వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్త కొండూరి పశుపతినాథ్, ప్రచార కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వై.నాగేందర్, యారప శ్యాంసుందర్ రెడ్డి, రమేష్, తుమ్మెటి బుచ్చిరాజు, పోలు లక్ష్మణ్, మాదాసు మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఖిలా వరంగల్: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఈమేరకు సీఐ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ కాశిబుగ్గ మార్కెట్ రోడ్డు ఇందిరాగాంధీ విగ్రహం సమీప కాలనీకి చెందిన మామిడాల మహేష్ (29) అనే పాత నేరస్తుడు జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తూ పట్టుబడగా, పలు పోలీస్ స్టేషన్లలో మూడు చోరీ కేసులు నమోదయ్యాయి. ఈనెల 8న వరంగల్ శివనగర్ సీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో రెండు హుండీల తాళాలను ధ్వంసం చేసి 10 వేల నగదుకు ఎత్తుకెళ్లాడని చెప్పారు. నర్సంపేట రోడ్డు తెలంగాణ జంక్షన్‌లో మహేష్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు వివరించారు.

పింగిళి విద్యార్థికి సెంట్రల్ యూనివర్సిటీలో సీటు



మేఘనను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) ఫైనల్ ఇయర్ పూర్తిచేసిన రావుల మేఘనకు కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ (ఫిజిక్స్)లో సీటు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మాజీ ఆఫీసర్లు డాక్టర్ మాధవి, రజిత, అధ్యాపకులు బుధవారం అభినందించారు. అనంతరం మేఘనకు కావాల్సిన పుస్తకాలు, నగదును భౌతిక విభాగం అధినేత డాక్టర్ స్నేహలత అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కంట్రోలర్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు సురేష్‌బాబు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేడెట్లకు అభినందనలు



కేడెట్లతో ప్రిన్సిపాల్ అరుణ, ఫ్లయింగ్ ఆఫీసర్ ప్రభాకర్

రామన్నపేట: సెప్టెంబర్ 23నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు బెంగళూరు రాష్ట్రంలోని జలహలి ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్‌లో పాల్గొన్న ఎల్‌బీ కళాశాల కేడెట్లు పీ.రాజేశ్వరి, టీ.అశిత్‌రాజ్, టీ.శేషును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, ఫ్లయింగ్ ఆఫీసర్ బీ.ప్రభాకర్ అభినందించారు. ఈ క్యాంపునకు ముందు సికింద్రాబాద్‌లోని బైసన్ ట్రెనింగ్ గ్రౌండ్‌లో కేడెట్లు కఠోర శిక్షణ తీసుకున్నట్లు వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ క్యాంపులో వారు పాల్గొనడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. దేశంలోని 17 డైరెక్టరేట్ల నుంచి సుమారు 600మంది కేడెట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ 6వ స్థానంలో నిలిచినట్లు వివరించారు.